ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY

మహబూబ్‌నగర్ జిల్లా వార్తలు

మంగళవారం 20 ఆగస్టు 2024



ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న మహబూబ్‌నగర్ బస్టాండ్

లీకేజీలకు చెక్

- ర్యాలంపాడు రిజర్వాయర్ కర్టయిన్ గ్రౌటింగ్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- రూ.153 కోట్లు అంచనా
- 2019 నుంచే రిజర్వాయర్‌కు లీకేజీలు..
- దాంతో రెండు టీఎంసీలే నిల్వ
- గట్టు లిఫ్ట్ పూర్తి చేసినా.. 'ర్యాలంపాడు'ను పూర్తిగా నింపకపోతే నిరుపయోగం
- లీకేజీలను అరికట్టాలని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన ఎమ్మెల్యే బండ్ల
- నెట్టెంపాడు సామర్థ్యం 20 టీఎంసీలకు పెంచాలని డిమాండ్



ర్యాలంపాడు రిజర్వాయర్ (ఫైల్)


మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ర్యాలంపాడు రిజర్వాయర్ కట్టకు సీపేజీ వల్ల ఐదేళ్లుగా లీకేజీలు అవుతున్న విషయం తెలిసిందే. కట్ట భద్రత, అన్నదాతలకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి పలుమార్లు తెలియజేసేందుకు 'ఆంధ్రజ్యోతి' ఈ లీకేజీలపై కథనాలను ప్రచురించింది. ఇటీవల బడ్జెట్ సమయంలో, అంతకుముందు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కూడా లీకేజీల నివారణతోపాటు నెట్టెంపాడు రిజర్వాయర్ల సామర్థ్యాన్ని 20 టీఎంసీలకు పెంచాలనే డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచారు. తర్వాత ప్రభుత్వం జూన్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం ఆర్‌ఈ(రివైజ్డ్ ఎస్టిమేషన్)కు సంబంధించిన నిధులు మాత్రమే కేటాయించడం, ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల నివారణకు కానీ, సామర్థ్యం పెంపునకు కానీ నిధులు కేటాయించకపోవడంతో తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని కూడా ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేశారు. తర్వాత పార్టీ నాయకత్వం ఒత్తిడితో కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెట్టెంపాడు లీకేజీలను అరికట్టడం కోసం తాజాగా నిధులు కేటాయించడానికి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాగునీటి శాఖ అధికారులు రూ.153 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం సూత్రప్రాయంగా నిర్ణయం జరగ్గా.. జీవో విడుదల కావడంతోపాటు టెండర్లు త్వరితగతిన పూర్తయితేనే ఈ సీజన్‌లో ఉపశమనం లభించకపోయినా వచ్చే వానాకాలం నాటికి ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. మరమ్మతుల కోసం దాదాపు ఆరు నెలల సమయం పట్టనుండగా.. టెండర్లు పూర్తికావడానికి కనీసం మరో రెండు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అయితే రివైజ్డ్ ఎస్టిమేషన్ మేరకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో 99, 100 ప్యాకేజీల పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ఈ రెండు ప్యాకేజీలను పూర్తి చేయకపోవడం వల్ల అలంపూర్ నియోజకవర్గంలో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందటం లేదు. పేరుకు ప్రాజెక్టు పూర్తయినప్పటికీ.. వారికి ఫలాలు మాత్రం అందడం లేదని చెప్పొచ్చు.

ఏం జరిగింది?

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని జూరాల బ్యాక్ వాటర్ ఆధారంగా 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. రూ.1,425 కోట్లతో పనులు ప్రారంభించగా.. అది కాస్త రూ.2,754 కోట్లకు పెరిగిపోయింది. అందులో రూ.2,503 కోట్ల మేర ఖర్చు చేశారు. మరో రూ.231 కోట్లతో బ్యాలెన్స్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. సీఎం సమీక్ష సమయంలో ఏడాదిలోపు పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుల జాబితాలో ఇది కూడా ఉంది. దీని కోసం రెండు బడ్జెట్లలో నిధుల కేటాయింపును ప్రతిపాదించారు. అయితే గత బడ్జెట్‌లో రూ.411.74 కోట్లు ప్రగతి పద్దు కింద కేటాయించినప్పటికీ.. అది గతంలో చేసిన రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు అధికంగా ఉంది. ఈ క్రమంలో ప్రాజెక్టు పూర్తిమాట దేవుడెరుగు.. అందులో లోపాలను సవరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. నికర జలాలపై ఆధారపడిన ఈ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 21.5 టీఎంసీలను కేటాయించారు. కానీ 2019 నుంచి ఈ పథకంలో ప్రధానమైన ర్యాలంపాడు రిజర్వాయర్‌కు లీకేజీలు అవుతున్నాయి. మొదట్లో దీనిని రెండు టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టగా.. తర్వాత నాలుగు టీఎంసీలకు పెంచారు. లీకేజీలు అవుతుంటం వల్ల నీటిని పూర్తి స్థాయిలో నింపొద్దని డ్యాం సేఫ్టీ అధికారులు నివేదిక ఇచ్చారు. లీకేజీలపై అధికారులు మూడేళ్ల క్రితం తనిఖీలు చేసి,ఒక నివేదిక ఇచ్చారు. కొంతమట్టిని తొలగించి, జియో మెంబ్రేన్ షీట్లు వేయాలని సూచించారు. అయితే గత ప్రభుత్వం ఈ నివేదికను పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం దీనికి సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని పలువురు కోరుతుండగా, తీవ్ర కరువు ప్రాంతమైన గట్టు మండలానికి వరప్రదాయినిగా నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతల పథకానికి నీరందాలంటే ర్యాలంపాడు రిజర్వాయర్ పూర్తిస్థాయి కెపాసిటీతో ఉండాలని అధికారులు చెబుతున్నారు. లేకపోతే ఇటు నెట్టెంపాడు ఆయకట్టుకు నీరందకపోవడంతోపాటు రూ.వందల కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న గట్టు ఎత్తిపోతల పథకానికి కూడా నీరందించే అవకాశం ఉండదు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ర్యాలంపాడు రిజర్వాయర్ మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏం చేస్తారు?

అధికారులు ప్రభుత్వానికి అందజేసిన నివేదిక ప్రకారం ర్యాలంపాడు రిజర్వాయర్ కట్టలో కొంతమేర తొలగించాలి. తర్వాత జియో మెంబ్రిన్ షీట్లను అమర్చి, మళ్లీ రివిట్‌మెంట్ చేయాలి. కానీ ప్రభుత్వం అలా కాకుండా కర్టయిన్ గ్రౌటింగ్ చేపట్టనుంది. గతంలో జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేసినప్పుడు కూడా మట్టికట్టలో ఇలాంటి లీకేజీలు రాగా.. వాటిని అరికట్టడానికి మట్టికట్టపై కోర్ డ్రిల్లింగ్ ప్రక్రియ ద్వారా రంధ్రాలు చేసి, సిమెంట్‌ను తీవ్ర ఒత్తిడితో లోపలికి పంపించారు. అందులో సీపేజీ అయ్యేచోటుకు సిమెంట్ జొప్పించి, లీకేజీలను అరికట్టారు. ఇప్పుడు కర్టయిన్ గ్రౌటింగ్‌లో కూడా డ్రిల్లింగ్ చేసి, పైపులు లేదా గ్యాలరీ ద్వారా సిమెంట్‌తోపాటు ఇతర మిశ్రమాన్ని లోపలకి పంపిస్తారు. తద్వారా కట్ట కింద నుంచి సీపేజీ కాకుండా అడ్డుకుంటారు. ఇందుకోసం దాదాపు రూ.153 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. పనులు ప్రారంభిస్తే ఆరు నెలల్లో పూర్తి చేయడానికి వీలుపడుతుంది. వచ్చే ఏడాది వానాకాలం నాటికి లీకేజీలను అరికట్టగలిగితే, ఆలోపు పూర్తిచేసే గట్టు ఎత్తిపోతల పథకంతోపాటు 99, 100 ప్యాకేజీల కాలువల పనులకు కూడా ఇబ్బంది ఉండదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ ప్రాజెక్టుకు 21.5 టీఎంసీల కేటాయింపులు ఉన్నా.. ఇప్పటివరకు కేటాయింపుల్లో సగం నీటినీ నిల్వ చేసుకోలేని దయనీయ పరిస్థితి ఉంది. నికర జలాలు ఉన్నప్పటికీ సరైన నిల్వ కెపాసిటీ లేకపోవడం ఉమ్మడి జిల్లాలోని పలు ఎత్తిపోతల పథకాలకు ప్రధాన సమస్యగా ఉందని చెప్పొచ్చు. ఏటా వేల టీఎంసీల నీరు జూరాల, శ్రీశైలం గుండా వెళ్తున్నా.. నిర్దేశించుకున్న నీటిని మాత్రం ఒడిసి పట్టుకోలేకపోతున్న పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ల సామర్థ్యం పెంచడం ద్వారా ఈ పరిస్థితిలో మార్పును తేవొచ్చు.



నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం నుంచి విడుదలవుతున్న నీరు (ఫైల్)

రాఖీ సందడి

రాఖీ పండుగను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు స్వగ్రామాలకు చేరుకుని అన్నా దమ్ముళ్లకు రాఖీలు కట్టారు. స్వీట్లు తినిపించి సంబురాలు చేసుకున్నారు. అన్నాదమ్ముళ్లు అక్కా చెల్లెళ్లకు కానుకలు, వస్త్రాలు ఇచ్చారు. పలువురు ప్రజా ప్రతినిధులకు వారి అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టారు. వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఊర్లు సందడిగా మారగా, బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి రాఖీ కడుతున్న సోదరి రామేశ్వరమ్మ



దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్‌కు రాఖీ కడుతున్న అక్కా, చెల్లెళ్లు



మహబూబ్‌నగర్‌లో వనపర్తి బస్సు ఎక్కడానికి గుమిగూడిన ప్రయాణికులు

బావిలో పడిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

- వనపర్తి పట్టణంలో ఘటన

వనపర్తి రూరల్, ఆగస్టు 19: తాగిన మైకంలో బావిలో పడిన వ్యక్తిని పోలీసులు కాపాడిన ఘటన వనపర్తి పట్టణంలోని రాజనగరం శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... వనపర్తి పట్టణంలోని రాయిగడ్డ ప్రాంతానికి చెందిన ప్రతాప్ ఆదివారం రాత్రి తాగిన మైకంలో బావిలో పడ్డారు. కంప చెట్లు ఉండటంతో బయటకు రావడానికి వీలు పడలేదు. దీంతో సోమవారం ఉదయం దాకా బావిలోనే ఉండాల్సి వచ్చింది. సోమవారం ఉదయం రాజనగరానికి చెందిన కొందరు ఉదయం వాకింగ్ చేస్తుండగా బావిలో నుంచి అరుపులు వినిపించాయి. ఇది గమనించిన వారు రూరల్ ఎస్‌ఐ జలంధర్ రెడ్డికి సమాచారం అందించారు. స్పందించిన ఎస్‌ఐ పోలీసుల సాయంతో అతన్ని రక్షించారు. బావిలో పడిన వ్యక్తి ప్రాణాలు కాపాడినందుకు రూరల్ ఎస్‌ఐ జలంధర్ రెడ్డి సిబ్బందిని ఘనంగా సన్మానించారు.



పోలీసుల సాయంతో బావిలోంచి బయటికి వచ్చిన ప్రతాప్

మంత్రి పర్యటనను అడ్డుకున్న వారిపై కేసు

- సుమోటోగా నమోదు చేసిన పోలీసులు

గద్వాల క్రైం, ఆగస్టు 19 : రెండు రోజుల క్రితం ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును అడ్డుకున్న సంఘటనలో 10 మందిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రాజెక్టులను పరిశీలించేందుకు శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోని చింతలపేట సమీపంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు వారి వాహనాన్ని అడ్డుకొని కారు అద్దాలపై రాళ్లు విసిరారు. ఈ సంఘటనకు సంబంధించి సోమవారం పోలీసులు సుమోటోగా 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గద్వాలలో వర్షం



బోయలగూడెం వాగు పొర్లడంతో తాడు సాయంతో ఊర్లోకి వస్తున్న కూలీలు

- పిడుగుపాటుతో ముగ్గురు మృతి
- పొంగిపొర్లిన వాగులు, వంకలు

గద్వాల/ ఉండవల్లి/ మల్దకల్/ గట్టు/ అయిజ, ఆగస్టు 19 : జోగుళాంబ గద్వాల జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వేర్వేరు చోట్ల పిడుగులు పడి ముగ్గురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గద్వాల, ధరూర్, మల్దకల్ మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అయిజ, మానవపాడు, ఉండవెల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. గద్వాల మండలం కుర్వపల్లి గ్రామానికి చెందిన భార్యభర్తలు ఆనంద్, సునీత, వారి కుమారుడు అరుణ్ తేజలు పొలంలో కలుపు తీస్తుండగా వర్షం కురిసింది. ఆనంద్, అరుణ్ తేజలు ముందుగా సమీపంలోని జమ్మిచెట్టుకిందికి వెళ్లారు. వర్షం ఎక్కువ కావడంతో సునీతను కూడా చెట్టు కిందికి పిలిచారు. ఆమె వస్తుండగానే చెట్టుపై పిడుగుపడింది. దీంతో ఆనంద్, అరుణ్‌తేజలు తీవ్రంగా గాయపడ్డారు. సునీత స్వల్పంగా గాయపడింది. వారిని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కర్నూల్‌కు తీసుకెళ్లారు. తండ్రీ కుమారుల పరిస్థితి విషమంగా ఉంది.

● ఉండవల్లి మండలంలోని కంచుపాడులో పింగర్ సిద్దన్న కొడుకు ఖాజామియ్య, కోడలు శాలిబీ ఇద్దరూ కలసి పొలంలోని మొక్కజొన్న చేనులో గడెం కొడుతున్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో వర్షం మొదలయ్యింది. దీంతో ఇంటికి వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా పెద్దశబ్దంతో పిడుగు పడింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. సమీపంలోనే ఉన్న కాడెద్దుల్లో ఒకటి చనిపోయింది. మరొకటి గాయపడింది.ఈ విషయాన్ని పక్క పొలంలో ఉన్న రైతులు గమనించి దంపతులిద్దరినీ ఉండవల్లిలో ప్రవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండల కేంద్రంలోని పొగాకు కంపెనీలోని వేపచెట్టుపై పిడుగు పడటంతో కొంతభాగం చీలిపోయింది. దానిమీదున్న గబ్బిలాలు చనిపోయాయి.

● మల్దకల్ మండల పరిధిలోని మేకలసోంపల్లికి చెందిన రైతు రవి పత్తి చేనులో కూలీలతో పని చేయిస్తున్నారు. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో కూలీలతో కలిసి ఇంటికి వస్తుండగా సమీపంలో పిడుగుపడింది. దీంతో అతడు షాక్‌కు గురికావడంతో గద్వాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించడంతో కోలుకున్నాడు.

దంచికొట్టిన వాన

ఉండవల్లి మండలంలో సోమవారం మధ్యాహ్నం గంటపాటు వర్షం దంచికొట్టింది. ఏడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగి పొర్లాయి. అలంపూర్ చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు గ్రామాలలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉండవల్లి అనసూయమ్మ కాలనీ వద్ద వాగు పొంగిపొర్లడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

రాకపోకలకు అంతరాయం

గట్టు మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. బోయలగూడెం సమీపంలోని వాగు ఉధృతంగా పారుతుండటంతో ఉదయం అటు వైపు వెళ్లిన కర్ణాటక కూలీలతో పాటు, స్థానిక రైతులు గ్రామంలోకి రాలేకపోయారు. దీంతో గ్రామస్థులు అవతలి ఒడ్డు నుంచి ఇవతలి ఒడ్డు వరకు తాడు కట్టి వారిని సురక్షితంగా వాగు దాటించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కేటీ మల్లేష్ తన సిబ్బందితో వాగు దగ్గరకు చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రి వరకు అక్కడే ఉండి బందోబస్తు నిర్వహించారు.

● అయిజలో భారీ వర్షం కురిసింది. దీంతో వీధులు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి.

పిడుగు పాటు మృతులు వీరే..

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ గ్రామంలో కర్నూలు జిల్లా నందవరంలోని కనకవీడు గ్రామానికి చెందిన వీరశేఖర్ కుమార్తె ఆదిలక్ష్మి(15) తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లింది. మధ్యాహ్నం ఆమెపై పిడుగు పడటంతో అక్కడికక్కడే చనిపోయింది.

అలంపూర్ మండలం క్యాతూరు గ్రామానికి చెందిన వేముల రాజు(40) పొలం వద్దకు వెళ్లాడు. వర్షానికి చెట్టు కిందకు వెళ్లడంతో పిడుగు పడి మృతి చెందాడు.

గట్టు మండలం ఆరగిద్దకు చెందిన నల్లారెడ్డి(30) పొలంలో పనులు చేసుకుంటుండగా పిడుగు పడి చనిపోయాడు.



పిడుగు పాటుకు గాయపడిన ఖాజను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తున్న సిబ్బంది

అప్పుడు భర్త.. ఇప్పుడు కూతురు

- ఓ మహిళ ప్రవర్తన నచ్చక ఆత్మహత్య
- భూత్పూర్ మండలం తాటిపర్తి గ్రామంలో ఘటన

భూత్పూర్, ఆగస్టు 19 : ఓ మహిళ ప్రవర్తన నచ్చక కొన్నాళ్ల క్రితం భర్త, ఇప్పుడు కూతురు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలో చోటుచేసుకున్నాయి. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాటిపర్తి గ్రామంలో బాల్‌నాగయ్య, మనెమ్మ దంపతులు ఉన్నారు. వారికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కొన్నాళ్లు హాయిగా సాగిన వారి సంసారంలో వివాహేతర సంబంధం అప్పుడు భర్తను ఇప్పుడు కూతురిని బలితీసుకున్నది. మనెమ్మ కొన్ని సంవత్సరాల నుంచి ఇదే మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగిఉన్నది. అయితే ఈ విషయంలో భర్త బాల్‌నాగయ్య పలుమార్లు భార్యను మందలించాడు. అయినా పద్ధతి మార్చుకోకపోవడంతో బాల్‌నాగయ్య గత ఏడాది ఆగస్టు 10వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి మనెమ్మ ఇద్దరు పిల్లలతో ఇంటి వద్దనే ఉంటూ కూలి పనులు చేసుకొని జీవిస్తోంది. తల్లి ప్రవర్తనతో కూతురు కూడా తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఆ బాలిక ప్రభుత్వ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. మృతురాలి మేనత్త అయిన చౌదరి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

- బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి ఢీకొన్న మరో బైక్

అచ్చంపేట టౌన్, ఆగస్టు 19: రెండు బైకులు ఢీకొని పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ సమీపంలోని వైచౌరస్తాలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండల పరిధిలోని శివారు తండా గ్రామానికి చెందిన జానకిరాం కొడుకు పాత్లావత్ శ్రీను(36) అమ్రాబాద్ మండలం దోమలపెంట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. సాయంత్రం విధులు ముగిశాక అచ్చంపేటకు బైక్‌పై వస్తున్నాడు. పట్టణ సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి వద్దకు రాగానే మండల పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన ప్రకాశ్ బైక్‌పై అచ్చంపేటకు వెళ్తూ వెనుక నుంచి శ్రీను బైక్‌ను వేగంగా ఢీకొన్నాడు. దాంతో శ్రీను తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే చనిపోయాడు. ప్రకాశ్‌కు కుడి భుజం వద్ద స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనుకు భార్య చంద్రకళ, ఒక కుమార్తె ఉంది.



పాత్లావత్ శ్రీను(ఫైల్)

వెంకటగిరిలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కొత్తకోట, ఆగస్టు 19 : మండలంలోని కానాయపల్లి, నిర్వేన్, పాలెం, కొత్తకోట గ్రామాల సరిహద్దుల్లోని వెంకటగిరి క్షేత్రంలో సోమవారం శ్రావణ నక్షత్ర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఏకశిలపై కొలువైన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వేదపండితులు నిర్వహించారు. కల్యాణ అనంతరం ఉత్సవ విగ్రహాలతో భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ పల్లకీ సేవ నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు శెట్టి, భాస్కర్, వెంకటేష్, తిరుపతిరెడ్డి, రాజేష్, వినయ్ కుమార్, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.


వెంకటగిరి క్షేత్రంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

శివాలయాల్లో పౌర్ణమి పూజలు ..

మండలంలోని శివాలయాల్లో పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని భవాని శంకర, పాత శివాలయం, భక్త మార్కండేయస్వామి దేవాలయాలతో పాటు కానాయ పల్లి, పామాపురం గ్రామ శివారులోని కోటిలింగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో శివలింగాలకు ఏకదాశ రుద్రాభిషేకం అనంతరం శివపార్వతులు కల్యాణం నిర్వహించారు. కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖరయ్య అన్నదానం చేశారు.

నేత్రపర్వంగా మార్కండేయస్వామి పల్లకీ ఊరేగింపు


స్వామివారి పల్లకి ఊరేగింపు

నారాయణపేట న్యూటౌన్, ఆగస్టు 19: నారాయణపేట సుభాష్‌రోడ్‌లో గల మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిచారు. సాయంత్రం పుర వీధుల్లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి పల్లకి సేవా ఊరేగింపు, భజన సంకీర్తనలతో నిర్వహించారు. పద్మశాలీలు ఆలయంలో జంధ్యాలు ధరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు క్యాతన్ రఘునాథ్, సాంబర్ శ్రీనివాస్, రాములు, వెంకట్రాములు, కేంచి గోపాల్, తాటి కృష్ణ, కర్లి ఆనంద్, అక్కల లక్ష్మణ్, ప్రభాకర్, కర్లి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి మాతా జల్దిబిందె ఊరేగింపు

పేట స్థానిక బ్రాహ్మణవాడి చౌడేశ్వరి మాతా జల్దిబిందె ఊరేగింపు పుర వీధుల గుండా నిర్వహించారు. అంతకుముందు బ్రాహ్మణవాడి చౌడేశ్వరి మాతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


జంధ్యాలు ధరిస్తున్న పద్మశాలీలు

చిన్నపొర్లలో ద్విచక్రవాహనం చోరీకి యత్నం

ఊట్కూర్, ఆగస్టు 19 : మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాన్ని చోరీ చేసేందుకు యత్నిస్తుండగా అలికిడి విని బయటకు వచ్చిన యజమాని కేకలు వేయడంతో వదిలి పారిపోయిన సంఘటన మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం బాధితుడు ఎస్‌డీ అన్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌డీ అన్వర్ ద్విచక్ర వా హనంపై బట్టలు అమ్మి జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఆదివారం రాత్రి నిద్రపోయాడు. అర్ధరాత్రి బాత్ రూంకు వెళ్లేందుకు బయటికి రాగా మాస్కులు ధరించిన ఐదుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకుని పోతుండగా చూసి కేకలు వేస్తూ ఇటుక విసరడంతో భయపడిన దొంగలు వాహనాన్ని వదిలి పారిపోయారు. అనంతరం చుట్టుపక్కల వారిని లేపి విషయం తెలియజేశాడు. వాహనాన్ని పరిశీలించగా వాహనం లాక్, ఇతర వైర్లు సైతం తొలగించి నట్లు గుర్తించారు. ఈ నెల మొదటి వారంలో గ్రామంలోని ఒక ఇంట్లో దొంగతనం జరగగా, మళ్లీ దొంగతన యత్నం జరగడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. దొంగలపై పోలీసులు నిఘా పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


చోరీకి యత్నించిన వాహనం ఇదే

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల, ఆగస్టు 19 : జడ్చర్ల మునిసిపాలిటీలోని ఇంపీరియల్ గార్డెన్ సమీపంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిందని జడ్చర్ల ఎస్ఐ శివానందం తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగి అయిన నరేంద్రసాగర్ ఈ నెల 16న ఇంటికి తాళం వేసి బంధువుల ఫంక్షన్‌కు కల్వకుర్తికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చిన నరేంద్రసాగర్‌కు, వేసిన తాళాలు విరగ్గొట్టి ఉండడం, కిటికీ విప్పబడి ఉండడాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి, వస్తువులు, దుస్తులు చిందరవందరగా ఉండడంతో చోరీ జరిగినట్లుగా గుర్తించారు. ఇంట్లో దాచిన సుమారు రూ.15వేల విలువగల బంగారు వస్తువు చోరీ జరిగిందని నరేంద్రసాగర్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ వివరించారు.

కలగానే మిగిలిన డబుల్‌బెడ్రూం ఇళ్లు

- నేటికీ కార్యరూపం దాల్చని ఇందిరమ్మ ఇళ్లు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లైనా లబ్ధిదారులకు అందలె..
- ఆశగా ఎదురు చూస్తున్న నిరుపేదలు

తాడూరు, ఆగస్టు 19 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ నూతన రాష్ట్రంలో రెండు పర్యాయాల పాటు అధికారంలో ఉండి ఇల్లులేనటువంటి నిరుపేద కుటుంబాలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ ఎక్కడా కార్యరూపం దాల్చకపోవడంతో గూడులేని కుటుంబాలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. గత 8 నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఐదు లక్షల వ్యయంతో నిర్మించి ఇస్తామని చెప్పడంతో పేద కుటుంబాల వారందరూ ఎంతగానో ఆశపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికీ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎలాంటి కార్యాచరణను సిద్ధం చేయకపోవడం మూలంగా గూడులేని వారు ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల విషయానికి సంబంధించి త్వరితగతిన కార్యాచరణను సిద్ధం చేసుకుని అర్హులైన వారందికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి గూడు ఏర్పాటు చేసే విధంగా ముందుకెళ్లాల్సిందిగా ఆయా గ్రామాల్లోని ఇల్లులేని నిరుపేద కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం అధికారుల, ప్రజాప్రతినిధుల మాటల ప్రకారం ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఒక్కో ఇంటికి ఐదు లక్షల రూపాయల నిధులను ఖర్చు చేసి నిర్మించేందుకుగాను ఏర్పాట్లు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఎక్కడా కార్యరూపం దాల్చడం లేదు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నిరుపేదలు జీవిస్తుండటంతో ప్రస్తుత వర్షాకాలం సందర్భంగా ఇళ్లు కూలి ఎంతోమంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. దీంతో చాలా మంది ఇల్లు లేనటువంటి వారందరూ తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పూరిగుడిసెలు, ప్లాస్టిక్ కవర్‌తో ఏర్పాటు చేసిన గుడిసెలతోపాటు రేకులతో డబ్బా మాదిరిగా ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కావున ఇలాంటి సమస్యలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని కోరుతున్నారు. గతంలో మాదిరి అసంపూర్తి పనులు కాకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ తప్పనిసరిగా ఇల్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే తాడూరు, ఇంద్రకల్ గ్రామాలల్లో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణాల కోసం లక్షల రూపాయలను వృథా చేసి వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఇల్లులేని అర్హులైన లబ్ధిదారునికి ఇల్లు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వం ఇల్లును మంజూరు చేయాలి

ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం ఒంటరి మహిళగా ఉన్న నాకు ఇల్లు లేకపోవడం మూలంగా జీవనం ఇబ్బందికరంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేసి సహాయపడితే బాగుంటుంది.

- నసీమ్‌బేగం, కుమ్మెర



తాడూరు కొమ్ముగుట్ట సమీపంలో బేస్‌మెంట్‌కే పరిమితమైన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు



సిర్సవాడలో ఇందిరమ్మ ఇంటి కోసం ఎదురుచూస్తూ రేకులతో ఏర్పాటు చేసుకున్న షెడ్డులో నివసిస్తున్న జంగిలయ్య కుటుంబం

● ఇంటి కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాం

ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇంటి కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాం. గతంలో నాకు ఉన్న పురాతనమైన ఇల్లు శిథిలావస్థకు చేరి గత వర్షాకాలం కూలిపోయింది. ప్రస్తుతం రేకులతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలికమైన డబ్బాలో జీవనం సాగిస్తున్నా. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇళ్లు త్వరగా మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- జంగిలయ్య, సిర్సవాడ



జాతీయ స్థాయి కరాటే పోటీలో ప్రతిభ కనబరిచిన విఘ్నేష్

చారకొండ, ఆగస్టు 19: మండల కేంద్రానికి చెందిన చారకొండ విఘ్నేష్ హైదరాబాద్‌లోని కర్మన్‌ఘట్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. హైద రాబాద్‌లోని ఎల్‌బీన గర్‌లోని ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన 38వ నేషనల్ లెవల్ షోటోఖాన్ కరాటే చాంపియన్‌షిప్ అండర్ 12,14 గ్రాండ్ చాంపియన్‌షిప్‌లో విఘ్నేష్ పాల్గొని ప్రథమ స్థానంలో ప్రతిభ కనబరిచి బహుమతిని పొందాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విఘ్నేష్‌ను తల్లిదండ్రులు, బంధువులు, కరాటే మాస్టర్ మహేష్, గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



షీల్డ్ అందుకుంటున్న చారకొండ విఘ్నేష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దండ, ఆగస్టు 19 : మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు కథనం ప్రకారం ... 36 ఏళ్ల వయసుగల వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి మొఖం గుర్తుపట్టలేనంతగా రక్తగాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలిస్తే వెల్దండ పోలీస్‌లను సంప్రదించాలని ఎస్ఐ కురుమూర్తి కోరారు.

ప్రేమించమని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

బిజినేపల్లి, ఆగస్టు 19 : మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన అప్పలి శ్రీకాంత్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ మహిళను 3 నెలలుగా ప్రేమించమని వేధిస్తున్నాడని సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళలపై దాడులు చేసిన, అసభ్యకరంగా వ్యవహరించిన, అనుచితంగా ప్రవర్తించినట్లు గుర్తిస్తే వెంటనే షీటీమ్స్‌కు గాని, స్థానిక పోలీసు స్టేషన్‌కు గాని సమాచారం ఇవ్వాలని ఎస్ఐ అన్నారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామని మహిళల సంరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు.



అప్పలి శ్రీకాంత్ (ఫైల్)

జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 19 : జిల్లా క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర అన్నారు. మెదక్‌లో ఈ నెల 17, 18తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీ పురుషుల విభాగంలో డి.నవీన్ స్వర్ణ పతకం, దీపక్, లింగం కాంస్య పతకం, బాలికల విభాగంలో పూజ కాంస్య పతకం సాధించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. నిరంతర సాధనతో క్రీడల్లో రాణిస్తారని, కోచ్‌ల సలహాలు, సూచనలు తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ఉపాధ్యక్షుడు రాజేందర్‌కుమార్, పుట్టి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్, సంయుక్త కార్యదర్శి సాదిక్‌అలీ,కోచ్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

30, 31న చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం



చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచన కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించిన బాద్మి శివకుమార్, ఆహ్వాన సంఘం సభ్యులు

జడ్చర్ల, ఆగస్టు 19 : ఈనెల 30 31వ తేదీలలో డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాదిమి శివకుమార్ అన్నారు. కార్యక్రమం కరపత్రాలను సోమవారం బాద్మి శివకుమార్ తన గృహం వద్ద ఆవిష్కరించారు. ఈ నెల 30న చాగంటి కోటేశ్వర్‌రావుకు స్వాగత కార్యక్రమం, జ్యోతి ప్రజ్వలన, హరిహరాదులకు పుష్పాంజలి, అనంతరం ప్రవచన కార్యక్రమం, అలాగే 31న నిత్య పూజా విధానంపై ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం సభ్యులు ఆలంపల్లి మనోహర్, పెద్దిపెంటయ్య, లక్ష్మీనారాయణ, పద్మలీల, మహేశ్వర్, దత్తుకుమార్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



యాదవేంద్రస్వామి దేవాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కృష్ణ, ఆగస్టు 19: కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలోని యాదవేంద్రస్వామి ఆలయంలో వివాహం చేసుకునేందుకు వచ్చిన దళిత కుటుంబంపై వివక్ష చూపిన వారిపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాల ముందు నిరసన వ్యక్తం చేశారు. అలాగే యాదవేంద్రస్వామి ఆలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దేవాలయ జీతభత్యాలు తీసుకుంటూ ప్రజల మధ్య చిచ్చుపెడుతూ అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్న ఉద్యోగి చక్రపాణిని ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దేవుళ్లకు సంబంధించిన ఆస్తులను అక్రమంగా అనుభవిస్తున్న వారిపై వెంటనే విచారణ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. మంత్రాలయ పీఠాధిపతి నుంచి అన్ని వర్గాల ప్రజలు పెళ్లిళ్లు చేసుకునేందుకు అనుమతి ఉన్నా ఇలా వివక్ష చూపించడం సరికాదన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రజాసంఘాల నాయకులు కృష్ణ, పృథ్వీరాజ్, నాగేష్, కల్యాణ్, మద్దిలేటి, మహాదేవ్, నరసింహ, వెంకటేష్, రమేష్, అనిల్ పాల్గొన్నారు.

ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్ సీజ్

వంగూరు, ఆగస్టు 19: మండలంలోని డిండిచింతపల్లి గ్రామ శివారులోగల దుందుభీ వాగు పరిసరాల ప్రాంతాల్లో డంప్ చేసిన ఇసుకను లారీల్లో అక్రమంగా తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున ఇసుకలారీ, ఇసుకను లోడింగ్ చేసిన ఎక్స్‌కవేటర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

లారీని, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసు కొని డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అనుమతులు లేకుండా పరిసరాల వాగుల నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఈసందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హుండీ చోరీ



ఆలయంలో హుండీని తొలగించిన దుండగులు



గేటు తాళాన్ని పగులగొట్టిన దృశ్యం

వడ్డేపల్లి, ఆగస్టు 19 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ గ్రామం పైపాడులోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని హుండీని సోమవారం గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి నగదుతో పాటు నాలుగు నూనె ప్యాకెట్లు ఎత్తుకెళ్లారని ఆలయ పూజారి సూదయ్య ఆచారి తెలిపారు. అలాగే శాంతినగర్‌లోని వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని గోవిందమ్మ అమ్మవారి విగ్రహం మెడలోని పుస్తెలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు.

రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

వడ్డేపల్లి, ఆగస్టు 19 : ఆరు రోజుల క్రితం చోరీకి గురైన రెండు మోటారుసైకిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు శాంతినగర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్, జూలకల్ స్టేజీ, అయిజ శివారు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి, వారినుంచి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కర్నూలుకు జిల్లాకు చెందిన పూలదాస్ వర్ధన్ అలియాస్ ఇక్బాల్, జాన్, రవికుమార్, కల్యాణ్‌లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మానవత్వం చాటుకున్న జడ్పీటీసీ మాజీ సభ్యురాలు

ధరూరు, ఆగస్టు 19 : ధరూరు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పద్మ మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి రాయపురం వద్ద ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డారు. అదే సమయంలో గట్టు మండలం ఇందువాసిలో నూతన ఆలయ ప్రారంభోత్సవానికి వెళ్తున్న జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మ వారిని గమనించారు. తన కారులో గట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

25 మొబైల్స్ రికవరీ : డీఎస్పీ



జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో మొబైల్స్‌ను అందజేసిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, ఆగస్టు 19 : జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో మొబైల్స్ పోగొట్టుకున్నవారితో పాటు చోరీకి గురైన 25 మొబైల్స్‌ను ట్రేస్ చేసిన పోలీసులు వాటిని మొబైల్స్ యజమానులకు డీఎస్పీ వెంకటేశ్వర్లు అందజేశారు. జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 25 మందికి మొబైల్స్ అందజేశారు. సీఈఐఆర్ ద్వారా మొబైల్స్‌ను ట్రేస్ చేశామని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ఇప్పటి వరకు సుమారు 300 మొబైల్స్‌ను ట్రేస్ చేసి వాటి యజమానులకు అందజేసినట్లు మొబైల్స్ ట్రేస్ చేసి సంబంధిత యజమానులకు మొబైల్స్ అందజేయడం పట్ల జడ్చర్ల సీఐ ఆదిరెడ్డితో పాటు సిబ్బందిని డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.

ఒండ్రు మట్టి రగడ

- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- ఒక వర్గానికే మేలు చేశారని ఆరోపణలు
- గణప సముద్రం చెరువులో లోతుగా తవ్వకాలు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 19: మండల కేంద్రంలోని గణప సముద్రంలో నాణ్యమైన ఒండ్రు మట్టి తరలింపు రగడ మండలంలో రసవత్తరంగా జరుగుతోంది. ఒండ్రు మట్టిని ఇష్టారీతిగా తరలిస్తూ ఒక వర్గానికి మాత్రమే మేలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒండ్రు మట్టి తరలింపులో అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ నాయకుడు ఇంటికి ఒక వర్గం వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారని, పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు వెళ్లడంతో సోమవారం పోలీస్‌స్టేషన్ వద్ద రెండు వర్గాల వారు పంచాయితీ చేశారు. ఒండ్రు మట్టి తవ్వకాలు అనుమతులకు మించి చేశారని ఆరోపణలు రావడంతో గ్రామంలోని నాయకులు రెండు వర్గాలుగా మారి గొడవకు దిగారు. ఈ గొడవ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వర్గీయుల పంచాయితీగా మారిపోయింది. గణప సముద్రం రిజర్వాయర్ ఏర్పాటుతో సుమారు 600 ఎకరాలు ముంపునకు గురి అవుతుండగా ఒక వర్గం వారికి చెందిన 40 ఎకరాల్లో మాత్రమే ఒండ్రు మట్టిని తవ్వడంలో ఆంతర్యం ఏమిటని రైతులు వాపోతున్నారు. చెరువులో అనుమతులకు మించి 10 ఫీట్ల లోతులో ఒండ్రు మట్టిని తవ్వడంతో రాబోయే రోజుల్లో రైతులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే నాణ్యమైన ఒండ్రు మట్టిని వేలాది వాహనాల్లో అనుమతులకు మించి తవ్వకాలు చేసి తరలించారని, ఈ మట్టికి పరిహారం తక్కువ ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. పోలీస్ స్టేషన్‌కు చేరిన ఒండ్రు మట్టి రగడపై ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణను వివరణ కోరగా రెండు వర్గాల వారు బయట రాజీ కుదుర్చుకొని వెళ్లిపోయారని తెలిపారు.



గణప సముద్రం చెరువులో ఒండ్రు మట్టిని తవ్వడంతో ఏర్పడ్డ గోతులు(ఫైల్)

గురుకులాల్లో వసతులు కల్పించాలి

- గురుకుల డిగ్రీ కళాశాల ముందు ధర్నా చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు
- సంప్రదించిన మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 19 : జిల్లా కేంద్రంలోని పిల్లల మర్రి సమీపంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో వసతులు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నందు, మణికంఠ అన్నారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కళాశాల ముందు గేటు ముందు విద్యార్థులు ఆందోళన చేశారు. ఇది తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడకు చేరుకుని విద్యార్థులకు మద్దతుగా సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గురుకులాకు స్వంత భవనాలు నిర్మించలేదని, అద్దె భవనాల్లోనే కళాశాలలను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అయినా కనీస వసతులపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ గురుకుల కళాశాలలో విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అక్కడికి చేరుకొని చేరుకొని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సర్ది చెప్పారు. సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముడు రోజుల్లో శాశ్వతంగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు అప్పటికప్పుడే మొబైల్ ట్రాన్స్‌ఫర్ ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పూర్తిగా నీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేయిస్తానని తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. సమస్యల పరిష్కారానికి చైర్మన్ ఆనంద్‌గౌడ్ హామీ ఇచ్చినందుకు అయనకు విద్యార్థులు ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాపారాయుడు, తిరుమల వెంకటేష్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాఘవ, రాఘవేందర్‌రెడ్డి, హకీమ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

ఊట్కూర్, ఆగస్టు 19 : తప్పిపోయి ఒంటరిగా నిలబడిన చిన్నారిని గంట వ్యవధిలోనే కుటుంబ సభ్యులకు పోలీసులు చేర్చారు. ఈ సంఘటన సోమవారం ఊట్కూర్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన కనకప్ప, ఎల్లమ్మ దంపతులు, వారి కుమారుడు ఆకాశ్ సోమవారం తిప్రస్‌పల్లి గ్రామానికి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. అనంతరం ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నాడు. ఆర్టీసీ డ్రైవర్ ప్రవీణ్ ఏడ్చుతూ నిలబడ్డ చిన్నారిని గమనించి మాట్లాడే ప్రయత్నం చేసినా బాలుడు ఏమి చెప్పలేదు. స్థానికులను విచారించిన ప్రయోజనం లేకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్ ప్రవీణ్ బాలుడిని నేరుగా ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు. ఈ విషయాన్ని యువకులు, పోలీసులు సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో తెలుసుకున్న తల్లిదండ్రులు ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వివరాలు తెలుసుకున్న పోలీసులు బాబును తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా యువకులకు, పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

వరల్డ్ తైక్వాండో మాస్టర్ యూనియన్ కోర్సుకు జిల్లా మాస్టర్లు

గద్వాల అర్బన్, ఆగస్టు 19 : కుక్కి వన్ ఇంటర్నేషనల్ మాస్టర్ కోర్సులో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన మాస్టర్ కే.శ్రీహరి, కోచ్‌లు రామేశ్వరి, సుధీర్‌కుమార్ ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కరాటే శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జార్ఖండ్ రాష్ట్రం, రాంచీలోని వరల్డ్ తైక్వాండో మాస్టర్ యూనియన్ ఆధ్వర్యంలో, తైక్వాండ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ కోర్సులో వారు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. తైక్వాండోలో నూతన మెళకువలు, నైపుణ్యాలపై వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు.



శ్రీహరి



రామేశ్వరి



సుధీర్‌కుమార్

మండల కార్యాలయాల నిర్మాణానికి నిధులివ్వండి

- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రికి జడ్చర్ల ఎమ్మెల్యే వినతి



నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 19 : జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూ ర్, ఊర్కొండ మండల కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చే యాలంటూ సోమవారం రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని జడ్చ ర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి మామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. జడ్చర్ల మునిసిపల్‌లోని సర్వే నెంబరు 477లోని మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు చేపట్టాలంటూ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. అలాగే బాలానగర్ మండలంలో ఉన్న చిన్న చెరువును మినీట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు.

ప్రవక్త మార్గం అనుసరించాలి

- మౌలానా సయ్యద్ అమీనుల్ ఖాద్రి



ధార్మిక సందేశం ఇస్తున్న మౌలానా సయ్యద్ అమీనుల్ ఖాద్రి

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 19 : ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలని మహారాష్ట్ర మాలేగావ్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ప్రసంగీకుడు సయ్యద్ అమీనుల్ ఖాద్రి అన్నారు. జిల్లా కేంద్రంలోని జామియా మసీదులో సోమవారం జల్సాయే రహెమతు లిల్ ఆలేమిన్ ధార్మిక సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సందేశమిచ్చారు. తమ సంపదలో కొంత పేదలకు పంచాలని, సామాజిక సేవలో పాల్పంచుకోవాలని సూచించారు. యువత చేడు మార్గాలకు దూరంగా ఉండాలని, మంచి ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ధార్మికవేత్త సయ్యద్ కలీముల్లా హుస్సేనీ కాఫిఫ్ పాషా, ఆలిండియా సున్నీ ఉల్మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహిసిన్ పాషా ఖాద్రి, మజీద్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్‌జకీ మతపెద్దలు అమీనుద్దీన్ ఖాద్రి, గౌస్ మొహియొద్దీన్, జామియా మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్‌సనా, మహ్మద్ ఖలీముద్దీన్, తఖీహుస్సేన్, అబ్దుల్ అజీజ్ మాదుమ్, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేను పటిష్టంగా చేపట్టాలి

- జడ్చర్ల యూపీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎం హెచ్‌వో



ఫార్మసీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

జడ్చర్ల, ఆడస్టు 19 : ఫీవర్ సర్వేను పటిష్టంగా చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పద్మ, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. జడ్చర్ల పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను వారు సోమవారం ఆక స్మికంగా తనిఖీ నిర్వహించారు. పీహెచ్‌సీలోని ఓపీ, ఐపీని పరిశీలిం చారు. ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను, చికిత్స కోసం వచ్చిన వారికి ఇస్తున్న తీరును పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే సమయమని, ప్రజలలో అవగాహన కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనుప్రియ, సిబ్బంది ఉన్నారు.

అయ్యప్ప గుట్టపై శివాలయంలో నూలు పౌర్ణమి పూజ

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 19 : పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప గుట్టపై ఏర్పాటు చేసిన నూలు పౌర్ణమి మహోత్సవం సందర్భంగా సోమవారం పద్మశాలీలకు జీవనాధారంగా ఉన్న నూలు పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు. రాఖీ పౌర్ణమి రోజుననే నూలును ప్రాంభించినట్లు పద్మశాలి సంఘం నాయకులు తెలిపారు. ఈ మహోత్సవం సందర్భంగా ముక్కంటుడికి ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజ్జ శంకర్, పల్లాటి శ్రీకాంత్, పల్లాటి బాలరాజు, పల్లాటి రామరాజు, జున్ను వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ నాయకులు

పాలమూరు, ఆగస్టు 19 : జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్యను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులతో పాటు ఆయన మాట్లాడారు. 15 రోజుల నుంచి జడ్చర్ల మునిసిపల్ కార్మికులు విధులు నిర్వహిస్తూనే నిరసన తెలుపుతున్న కార్మికులపట్ల అమానుషంగా ప్రవర్తించటం సరికాదన్నారు. కార్మికులను తొలగించే అధికారం కమిషనర్‌కు లేదన్నారు. అప్రజాస్వామికం, నిరంకుశంగా వ్యవహరిస్తున్న కమిషనర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. గోనెల రాములు, ఎర్రం నరసింహులు, వరద గాలెన్న, బి.చంద్రకాంత్, వెంకటయ్య, ఆది విష్ణువర్ధన్, భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్నాడంటూ కమిషనర్‌పై ఫిర్యాదు

జడ్చర్ల, ఆగస్టు 19 : జడ్చర్ల మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను కమిషనర్ రాజయ్య వేధింపులకు పాల్పడుతున్నాడంటూ సోమవారం కలెక్టర్ విజయేందిర బోయికి సీఐటీయూ, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్మికులను విధుల నుంచి తొలగించామని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, ఉపాధ్యక్షులు గాలెన్న, మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మహేష్, కృష్ణ, విజయ్ ఉన్నారు.

నేడు రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 : పట్టణంలోని అశోక్‌టాకీస్ చౌరస్తాలో నూతనంగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డిలతో పాటు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి నివాళి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆగస్టు 19 : సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వసీంఖాన్ మృతి పట్ల జనరల్ ఆసుపత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాముసాయక్ మాట్లాడుతూ సూర్యాపేట ఆసుపత్రిలోని అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు వేతనాలు సరిగా ఇవ్వకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. ఈ జనరల్ ఆసుపత్రిలోని ఏజెన్సీ నిర్వాహకులు కూడా 5 నెలలపైన వేతనాలు ఇవ్వడం లేదని, సరిగ్గా వేతనాలు ఇవ్వకపోవడంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందులుపడుతూ కుటుంబాలను పోషిస్తున్నారన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు కుర్మయ్య, సతీష్, రామానాయుడు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నా..చెల్లెలి అనుబంధం

- సంప్రదాయబద్ధంగా రక్షా బంధన్
- సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపిన సోదరీమణులు
- సుదూర ప్రాంతాల నుంచి గ్రామాలకు చేరిన అక్కాచెల్లెల్లు



ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు రాఖీలు కట్టేకంటే ముందు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్.ఎం.శ్రీదేవి, డి.ఎం. సుజాత

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 19 : రాఖీ పర్వదినం సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్.ఎం. వి. శ్రీదేవి, డి.ఎం సుజాత కండక్టర్లు, డ్రైవర్లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కండక్టర్లు కూడా పలువురికి రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

● మాజీ మంత్రికి : రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మాజీ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్‌కు ఆయన సోదరి శ్రీదేవి రాఖీ కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

● మహబూబ్‌నగర్ : రాఖీ పర్వదినం పురస్కరించుకొని మునిసిపల్ సమావేశ మందిరంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్‌కు మహిళా ఉద్యోగులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్‌తోపాటు కౌన్సిలర్లకు మునిసిపాలిటీలో పనిచేసే ఉద్యోగులు రాఖీ కట్టారు.

● జడ్చర్ల : రాఖీ పండుగను జడ్చర్ల నియోజకవర్గంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నాకు నీవు రక్ష.. నీకు నేను రక్ష అంటూ సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి, ఆశీర్వదించారు. హైదరాబాద్‌లో ఉన్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి మంత్రి సీతక్క రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డికి సోదరీమణులు సద్గుణ, సువర్ణలు రాఖీలు కట్టారు. రాఖీ పండుగ సందర్భంగా పట్టణంలోని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దేవరకద్ర : తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

● దేవరకద్ర : నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాలతో పాటు వివిధ అన్ని గ్రామాల్లో సోమవారం రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాలను ఆడపడచులు రాఖీలు కట్టేందుకు గ్రామాలకు వెళ్లారు. అన్నా దమ్ములకు, అక్కా చెల్లెల్లు రాకీలు కట్టి మిఠాయిలు తినిపించి హారతి పట్టారు.

● చిన్నచింతకుంట : మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రాఖీ కట్టేందుకు వచ్చిన బంధువులతో ఇళ్లు సందడిగా మారాయి.

● రామలింగేశ్వరస్వామి ఆలయంలో : పౌర్ణమి సందర్భంగా మండలంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి పల్లకి సేవా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

● రాజాపూర్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా చేసుకున్నారు. అన్నాతమ్ముళ్లకు అక్కా చెల్లెల్లు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి, ఆప్యాయతను పంచుకున్నారు. దూర ప్రాంతాల నుండి ఆడపడుచులు రాఖీలు కట్టడానికి రావడంతో ఇళ్లల్లో పండుగ వాతవరణం ఏర్పడింది.

● గండీడ్/ మహమ్మదాబాద్ : రాఖీ పౌర్ణమీ పండుగ పురస్కరించుకొని ఉమ్మడి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అన్నదమ్ములకు రాఖీ కట్టడానికి సోమవారం గ్రామాలకు చేరుకున్నారు. అక్కా చెల్లెల్లు తమ అన్నాదమ్ములకు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

● హన్వాడ : రాఖీ పౌర్ణమీ సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అన్నాదమ్ములకు రాఖీలుకట్టి శుభాకాంక్షాలు తెలుపుకున్నారు.



జడ్చర్ల : గంగాపురంలో సోదరుడికి రాఖీలు కట్టిన సోదరీమణులు



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరి శ్రీదేవి

దూరమైన వారు కూడా ఈ పండుగకు ప్రేమతో కలుసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

● భూత్పూర్ : రాఖీపౌర్ణమి వేడుకలను మండలంలో అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క హైదరాబాద్‌లో రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇంటి దగ్గర ఆయన అక్కాచెల్లెల్లు, మహిళలు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆయన అక్కాచెల్లెల్లు ఇంటికి వచ్చి రాఖీలు కట్టారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల మహిళలు, ఆయనకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

● బాలాగనర్ : మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన ఆడపడుచులు తమ పుట్టినింటికి వెళ్లి తోబుట్టువులకు రాఖీలుకట్టి తమ ఆనందాన్ని వ్యక్తపర్చారు.

బొటానికల్ గార్డెన్‌లో వృక్ష రక్షాబంధన్



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో వృక్షాలకు రాఖీలు కడుతున్న ఆర్ఎస్ఎస్ మహిళా విభాగం సభ్యులు

జడ్చర్ల, ఆగస్టు 19 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో రాఖీ పౌర్ణమి సందర్భంగా వృక్షాలకు రక్షాబంధన్ కార్యక్రమాన్ని బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య సమక్షంలో పట్టణంలోని ఆర్ఎస్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వృక్షాలకు రాఖీలు కట్టారు. పర్యావరణం సుభిక్షంగా ఉండాలని వృక్షాలకు రాఖీలు కట్టినట్లు సభ్యులు చైతన్య, భాగ్యశ్రీ, శ్యామిలి, బాలమణి, రామకృష్ణలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

- ప్రజావాణిలో కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఆగస్టు 19 : సమస్యలపై ప్రజలు చేసుకుంటున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెనువెంటనే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. పరిష్కారంలో ఎలాంటి జాప్యం, అలసత్వం గాని చేయవద్దని సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులలో అధికశాతం భూములకు సంబంధించినవి కాగా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, వ్యక్తిగత విషయాలపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఈ సోమవారం ప్రజావాణిలో 38 మంది ఫిర్యాదులు చేశారని వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, డీఆర్‌డీవో రవికుమార్, డీఆర్డీవో నర్సింహులు, అధికారులు హాజరయ్యారు.

ఆన్‌లైన్ అప్‌డేట్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

జనవరి 1, 2025 తేదీ ఆధారంగా చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు నిర్వహించనున్న ఇంటింటి పరిశీలన ఆన్‌లైన్ అప్‌డేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ విజయేందిర బోయి తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ 2025కు సంబంధించి ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న ఇంటింటి పరిశీలనపై సోమవారం కలెక్టర్ కలెక్టర్ కార్యాల యంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో తహసీల్దార్ల సమీక్షించారు. బీఎల్‌వోలకు వారి పోలింగ్ పరిధిలోని మ్యాప్‌ను కలర్ ప్రింట్ అప్పగించాలని, అలాగే బీఎల్‌వోలు ఓటరు జాబితా ముందు ఉంచుకొని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అన్ని రెసిడెన్సియల్ స్కూళ్లను పరిశీలించాలి

ఈ వారం చివరి వరకు జిల్లాలోని అన్నీ రెసిడెన్సియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సౌకర్యాలు, శానిటేషన్, భోజనం, ఆరోగ్యం, తదితర అంశాలను తనిఖీ చేసి నిర్ధేశించిన ప్రొఫార్మాలో నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదే శించారు. సోమవారం ఆమె కలెక్టర్ ర్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమ్మిళిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, రెసిడెన్సియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు తనిఖీ చేసిన అనంతరం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల 15 పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన శకటాల ప్రదర్శనలో ఉత్తమ శకటాలుగా బహుమతులు గెలుచుకున్న శాఖలకు జిల్లా కలెక్టర్ అవార్డులను అందజేశారు. కాగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ శఖటం ఉత్తమ మొదటి శఖటంగా భహుమతిని గెలుచుకోగా, మహబూబ్ నగర్ మునిసిపాలిటీ రెండవ బహుమతిని, వ్యవసాయ శాఖ మూడవ బహుమతిని, జిల్లా విద్యాశాఖ కన్సోలేషన్ బహుమతిని గెలుచుకున్నాయి. ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, డీఆర్వో కేవీవీ రవికుమార్, డీఆర్డీవో నర్సింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లైబ్రరీలో వసతులు కల్పించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : లైబ్రరీలకు వచ్చే పాఠకులకు అన్ని వసతులు ఉండే విదంగా చూడాల, పుస్తకాలతో పాటు కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ విజయందిర బోయి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డులో గల లైబ్రరీ, రాంమందిర్ చౌరస్తాలో ఉన్న సెంట్రల్ లైబ్రరీలను పరిశీలించారు. అక్కడ కంప్యూటర్ సౌకర్యం, పుస్తకాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రంధాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శివేంద్రప్రతాప్, కార్యదర్శి మనోజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు రక్షణ ఏదీ ?

- 20 రోజుల్లో న్యాయవాదులపై మూడోదాడి

- నిరసన వ్యక్తం చేసిన న్యాయవాదులు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 : న్యాయవాదులపై వరుస దాడులు జరుగుతున్న ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోకపోవడం వల్ల వరుసగా దాడులు జరుగుతున్నాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. రక్షణ కరువైనందున ఇరవై రోజుల్లో న్యాయవాదులపై మూడు దాడులు జరిగాయన్నారు. పోలీసులు ఇష్టానుసారంగా న్యాయవాదులపై దాడులు చేస్తున్నారని అన్నారు. కూకట్‌పల్లి బార్‌అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది సంతోష్‌పై బోరబండ ఎస్ఐ అనుచితంగా వ్యవహరించారని, అతనికి సంబంధం లేని కేసులో న్యాయవాది అని చూడకుండా ఇష్టారీతిన వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ చర్యను నిరసిస్తూ న్యాయవాదుల రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసి యేషన్ పిలుపు మేరకు సోమవారం పాలమూరులో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించిన కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాంనాథ్‌గౌడ్, న్యాయవాదులు చంద్రమౌళి, అనంతరెడ్డి, జకి, స్వదేశ్, ఉమామహేశ్వరి, టి.కృష్ణ పాల్గొన్నారు.

జడ్చర్ల : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని జడ్చర్ల అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జంగయ్య డిమాండ్ చేశారు. కూకట్‌పల్లిలో అడ్వకేట్ సంతోష్‌పై బోరబండ పోలీసులు దాడికి నిరసనగా సోమవారం జడ్చర్లలో కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాలిక్ షాకీర్, యాదిరెడ్డి, రమేశ్, తిరుపతి, ఇష్తెకార్, రాములు, విశ్వేశ్వర్, మహేశ్వర్‌రెడ్డి, పురుషోత్తం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఛాయాచిత్రానికి ఉన్న విలువ ఎప్పటికీ తగ్గదు

- ఫొటోగ్రఫీ డేలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్



జిల్లా కేంద్రంలో ఫొటో అండ్ వీడియో గ్రఫీ జర్నలిస్టుల దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఆగస్టు 19 : ఫొటో అండ్ వీడియో రంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఆ రంగంలో తీస్తున్న ఛాయాచిత్రానికి ఉన్న విలువ ఎప్పటికీ తగ్గదని మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక శాసన సభ్యుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ అండ్ వీడియో గ్రఫీ జర్నలిస్టుల వేడుకలకు మునిసిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. ఫొటో అండ్ వీడియో గ్రఫీ జర్నలిస్టులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఫొటో జర్నలిస్టులు గడ్డం రవి కుమార్, మధుసూదన్, చంద్రశేఖర్ గౌడ్, రాజశేఖర్, రఘు, వెంకట్, కిరణ్ కుమార్, కృష్ణ, వీడియో జర్నలిస్టులు ఏబీఎన్ సంతోష్ కుమార్, శ్రీనివాసులు, హెచ్‌ఎంటీవీ అరవింద్ రెడ్డి, కృష్ణ, శ్రీనివాసులు, వి6 రాజశేఖర్, శ్రీనివాసులు, టీవీ 5 అంజి, టీవీ9 రాజేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘన నివాళి

రాజాపూర్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఫొటోగ్రఫీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ల ర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ముస్తఫా, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో...

కోయిలకొండ : మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో గ్రాఫర్ సృష్టి కర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు శేఖర్ నాయకులు పరందాములు, నాగరాజు, రమేష్, శ్రీను, సూరి యాదవ్, సంజీవ, ఆనంద్‌గౌడ్, రాజశేఖర్, రమేష్‌బాబు, తిరుమలేష్ మనోజ్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో వీరభద్రస్వామి

కోయిలకొండ, ఆగస్టు 19 : మండలంలోని ఆచార్యపూర్ భద్రకాళి వీరభద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాస సోమవారం పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకం, బిల్వార్చన పూజలను జరిపించారు. శ్రావణ సోమవారం సందర్భంగా దేవాలయంలో రుద్ర హోమం, అర్చన పూజలు జరిపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి, ఆది ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

22న ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 19 : రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పాల్గొనే బాల, బాలిక, మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఈ నెల 22న స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఇండోర్ స్టేడి యంలో సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న అఖండదీపారాధన భజన

దేవరకద్ర, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని వెలిసిన ఈశ్వరవీరప్పయ్య, వాసవీమాత దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో సోమవారం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మూడవ సోమవారం, రాఖి పండుగ కావడం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వీరప్పయ్య ఆలయంలో అఖండ దీపారాధనతో పాటు సాయంత్రం భజన భక్తులు భజనలు చేశారు.

ఘనంగా సంతోషిమాత జయంతి



జడ్చర్లలో సంతోషిమాత జయంతి సందర్భంగా అమ్మవారికి డోలారోహణం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల, ఆగస్టు 19 : జడ్చర్ల పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో సంతోషిమాత జయంతి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతర మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని చేశారు. అమ్మవారికి పల్లకీసేవ, డోలారోహణం కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి : కేవీపీఎస్

పాలమూరు, ఆగస్టు 19 : జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి దగ్గర ఉన్న ఎస్సీ గురుకుల డిగ్రీ కళాశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రతినిధి బృందం సోమవారం కలెక్టర్‌ను కోరింది. పది రోజుల నుంచి ఎస్సీ కళాశాలలో తాగునీరులేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్నానాలు చేయటానికి, బాత్రూంలకు, దుస్తులు ఉతకడానికి, నీళ్ల లేక ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరించకుండా విద్యార్థులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. ఇలాంటి ప్రిన్సిపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే పరిష్కరించేందుకు కలెక్టర్ మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మాణిక్యంరాజు, ఎం.కుర్మయ్య ఆది విష్ణు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ బాలయ్య పాల్గొన్నారు.